అతి 'నిరోధకాలు'.. అనర్థాలు!

- జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరాపురం వరకు సీసీ రోడ్డు నిర్మాణం
- 26 కిలోమీటర్లు 46 స్పీడు బ్రేకర్లు
- స్పీడు బ్రేకర్ల వద్ద ఏర్పాటు చేయని సూచికలు
- సీసీ రోడ్డుకు పగుళ్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు




బిలకలగూడూరు- నంద్యాల రహదారిలో స్పీడు బ్రేకర్ల వద్ద సూచికలు ఏర్పాటు చేయని దృశ్యం,గ్రంధివేముల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్



నంద్యాల రహదారిలోని గడిగరేవుల గ్రామం వద్ద సీసీ రోడ్డుపై పగుళ్లు ఏర్పడిన దృశ్యం

గడివేముల: గడివేముల నుంచి నంద్యాలకు వెళ్లాటంటే నరకయాతన. నడుం నొప్పులుంటే పోతాయ్...లేకుంటే మాత్రం తప్పకుండా వస్తాయ్. ప్రమాదాలను నివారించాల్సిన స్పీడు బ్రేకర్లే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డు మీద స్పీడు బ్రేకర్ ఉన్నట్లు బోర్డులు ఉండవు, రాత్రివేళల్లో కంటికి కనిపించేలా రేడియం స్టికర్లు ఉండవు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

2007లో డబుల్ రోడ్డు నిర్మాణం

2007లో బిలకలగూడూరు సమీపంలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. జిందాల్ సంబంధించిన భారీ వాహనాలు నడిచేందుకు ఆర్అండ్బీ రహదారిని జిందాల్ యాజమాన్యం తమ అధీనంలోకి తీసుకొని దాదాపు 26 కిలో మీటర్ల మేర సింగిల్‌రోడ్డు ఉన్న రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చి సీసీ రోడ్డు నిర్మించింది. అంతవరకు బాగానే ఉంది. అప్పటి నుంచే మండల ప్రజలకు, వాహదారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

సూచికలు కరువు

జిందాల్ యాజమాన్యం నంద్యాలలోని వేంకటేశ్వరపురం వరకు నిర్మించిన సీసీ రోడ్డులో ఇష్టానుసారంగా స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేశారు. గడివేముల నుంచి వెంకటేశ్వరపురం వరకు దాదాపు 26 కిలోమీటర్లకు 46 స్పీడు బ్రేకర్లు ఉన్నాయి. స్పీడు బ్రేకర్ల వద్ద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో అనేక ప్రమాదాలకు గురై మరణించిన సంఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా సీసీ రోడ్డులో పగుళ్ల రావడంతో అనేక ప్రమదాలు జరిగాయి. రాత్రి వేళల్లో ఈ రహదారిలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిలో చీలికలతో ఏర్పడటంతో అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి.

ఆపద సమయంలో ప్రాణాలు పోవాల్సిందే

గడివేముల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అత్యవసర వేళల్లో ఆస్పత్రులకు వెళ్లేలోపే ప్రాణాలు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తీసుకెళ్లె సమయంలో ఆసుపత్రికి చేరుకోలేక ప్రయాణాలుపోయిన సంఘటనలూ ఉన్నాయి. గడివేముల నుంచి నంద్యాలకు చేరాలంటే గంట సమయానికి స్పీడు బ్రేకర్లు అధికంగా ఉండటంతో రెండు గంటలు పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్బీ అధికారులు స్పందించి అవసరం లేని స్పీడు బ్రేకర్లను తొలగించి, రోడ్డు పై చీలికలకు మరమ్మతులు లేక నూతనంగా రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాత్రివేళల్లో ఇబ్బందులు



మా ఊరు నుంచి నంద్యాలకు వెళ్లాటంటే చాలా సమయం పడుతుంది. కొన్ని చోట్ల అవసరం లేకున్న చోట స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు రేడియం స్టికర్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో బ్రేకర్లు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో కొత్తవారు ప్రయాణింరంటే ప్రమాదపు బారిన పడాల్సిందే. అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేసి ప్రాణాలను కాపాడండి.

–యాసిన్ బాషా, గడివేముల

అనవసరమైన స్పీడు బ్రేకర్లను తొలగించాలి



గడివేముల–నంద్యాలకు రహదారిలో అనవసరంగా ఉన్న స్పీడు బ్రేకర్లను తొలగించాలి. రోడ్డుపై అక్కడక్కడ ఏర్పడిన చీలికలను పూడ్చివేయాలి. ప్రజలకు, వాహనదాలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలి. గ్రంధివేముల, చిందుకూరు, గడిగరేవుల గ్రామాలలో స్పీడు బ్రేకర్ల వద్ద ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో పాటు రొడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలు రోడ్డు పైకి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– గోదా ప్రసాద్, ఉపసర్పంచ్, గడిగరేవుల గ్రామం



సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపు నీరు

రోడ్లపై నీటి మడుగులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో చినుకు పడితే పడితే చాలు ప్రధాన రోడ్లు మడుగుల మయంగా మారుతున్నాయి. గత రెండు రోజులుగా మండలంలో వర్షాలు విస్తారంగా కురిశాయి. శనివారంతో పాటు ఆదివారం సాయంత్రం మండలంలో 20.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. దీంతో తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రధాన రోడ్డుపై గుంతల్లో మొకాలి లోతు నీరు చేరాయి. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అదేవిధంగా విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు, బస్టాండ్ నుంచి పలు కుదొడ్డి క్రాస్ రోడ్డు వరకు ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రోడ్డుపై గోతులలో వర్షపు నీరు నిలవడంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి రోడ్లను బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సి.బెళగల్‌లో ప్రధాన రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

క్లుప్తంగా

ప్రారంభమైన కలశ ప్రతిష్ట వేడుకలు



కలశాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే దపంతులు

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కలశ ప్రతిష్ట వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయంలో గణపతిపూజతో మొదలై.. మధ్యాహ్నం వరకు విశిష్ట పూజలు జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గౌరు చరిత, భర్త గౌరు వెంకట్‌రెడ్డి దంపతులు హాజరై కలశాలకు పూజలు చేశారు. అంతకు ముందు స్వామి వారి మూలవిరాట్‌కు పూజలు చేయడం జరిగింది. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణ, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

పాణ్యం : మండల పరిధిలోని మద్దూరులో దేవదాయశాఖ భూములకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట ..నిర్ణీత ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు దేవదాయశాఖ గ్రూప్ ఆలయాల ఈఓ గోపి తెలిపారు. గ్రామంలోని శ్రీ మాధవస్వామి ఆలయానికి సంబంధించిన భూములకు వేలం పాట నిర్వహించగా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రైతులు అధికంగా పాడలేదన్నారు. దీంతో వాయిదా వేశామని, మళ్లీ నిర్వహించే తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

పది సప్లిమెంటరీకి 9 మంది గైర్హాజరు

సి.బెళగల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం స్థానిక మోడల్ స్కూల్లో ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. మొత్తం 45 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 36 మంది మాత్రమే హాజరయ్యారు. 9 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ అధికారి ధనుంజయగౌడ్ తెలిపారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించండి

పాణ్యం: పీజీఆర్ఎస్‌లో వచ్చే దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో పర్యటించి అందరి సమక్షంలో పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన



డీఎస్సీ అభ్యర్థికి స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్): కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఖ్యాతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సోమవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. తరగతులకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడారు. అనంతరం నిర్వాహకులతో కలిసి ఉచితంగా స్టడీ మెటీరియల్ బుక్స్‌ను అభ్యర్థులకు అందజేశారు. సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, ట్రైనరు కళ్యాణ్ కుమార్, డీఎస్సీ అభ్యర్థులు ఉన్నారు.

పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు నల్ల, తెల్ల బార్లీ పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. నల్లబార్లీ పొగాకును కొనుగోలు చేయడంలో కంపెనీలు సిండికేట్‌గా మారి రైతుల కష్టార్జితాన్ని కాజేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరితో కంపెనీలు పొగాకును కొనుగోలు చేయడం లేదన్నారు. ఫలితంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కారదర్శి దంబోళం శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

తుగ్గలి : యువతి అదృశ్యమైన ఘటన తుగ్గలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఎద్దులదొడ్డికి చెందిన హెచ్ బాలరాజుకు ఐదుగురు కూతుళ్లు. వారిలో నాల్గవ కూతురు సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించిన ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటలో గెలుపోటములు సహజం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: క్రీడాల్లో గెలుపు ఓటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురంలో ఎబీఎమ్ చర్చి 18వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలను నిర్వహించారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో 28వ వార్డు కార్పొరేటర్ నారాయణరెడ్డి, సత్యంరెడ్డి, శేషారెడ్డి, తిరుపాల్, బాబు, కృపానందం, శివశంకర్‌రెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

31న 'చలో సిద్ధేశ్వరం'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి, ప్రజాసంఘాల నాయకులు

కల్లూరు: ఈనెల 31న చేపట్టే చలో సిద్ధేశ్వరం పోస్టర్లను సోమవారం చిన్నటేకూరులో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజా సంఘాల ఐక్య వేదిక రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టు అవశ్యకత గురించి వివరించారు. కృష్ణానదిపై సిద్దేశ్వరం గ్రామం దగ్గర అలుగును నిర్మిస్తే రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 31 సిద్ధేశ్వరంలో ప్రజా బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు, నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామాంజనేయులు, శేషగిరి, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు కొని మోసపోవద్దు



గోరంట్లలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: నాసిరకం పత్తి విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. సోమవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఏఓ రవిప్రకాష్ పర్యటించి ఖరీఫ్‌లో సాగు చేసే పంటలపై రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలను కొనాలని, లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనరాదని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతుంటే అలాంటి వారి సమాచారం తమకిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. ముందస్తుగా వర్షాలు కురుస్తున్నందున రైతులంతా పొలాలను దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేసుకోవాలని, అదనులోనే విత్తనం నాటాలని ఏఓ సూచించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ పురుషోత్తంకు అర్జీలు ఇస్తున్న రైతులు

సి.బెళగల్: తమ భూ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తంకు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కంబదహాల్, కొత్తకోట, పోలకల్, ఇనగండ్ల, పలుకుదొడ్డి తదితర గ్రామాలకు చెందిన రైతులు తరలివచ్చి తమ భూ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. అర్జీలను పరిశీలించిన తహసీల్దార్ సమస్యలను పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పీఆర్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, వెంకట్‌ప్రకాష్, ఉపాధిహామీ ఏపీఓ రామన్న హాజరయ్యారు. విద్యా, ఇరిగేషన్, విద్యుత్, వెలుగు, ఈఓఆర్డీ తదితర అధికారులు పీజీఆర్ఎస్‌కు డుమ్మా కొట్టారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఉలిందకొండ పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్‌నాయక్

కల్లూరు: సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలని జోనల్ (కడప) మలేరియా ఆఫీసర్ డాక్టర్ కె.లక్ష్మణ్ నాయక్ వైద్యులను ఆదేశించారు. సోమవారం కల్లూరు మండల పరిధిలోని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కర్నూలు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో పలు రిపోర్టులు, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉలిందకొండ గ్రామంలోని వీధులలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న పరిసరాలలో అబేట్, బైటెక్స్ ద్రావణాన్ని పంచాయతీ సిబ్బందితో కలసి పిచికారీ చేయించాలన్నారు. వేస్ట్ ఆయిల్‌ను డ్రైనేజీ కాలువలలో చల్లాలన్నారు. డ్రైడే ఫ్రైడే నిర్వహించి డ్రమ్ములు, నీటి తొట్లు, వాడి పడేసిన కూలర్లు, పాత టైర్లలో నీరు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ విజయకుమార్, సూపర్‌వైజర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు



వెంకటగిరి వద్ద రోడ్డుపై నీటి మడుగులు

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి వెంకటగిరి మీదుగా గోరంట్ల, లద్దగిరి వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఏడాది కాలం నుంచి కూటమి ప్రభుత్వాన్ని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా, పల్లె పండుగ పేరుతో ప్రభుత్వం హంగామా చేసిందే తప్ప ఈ రోడ్డుకు మాత్రం ఎలాంటి మరమ్మతులు చేయలేదు. దీంతో ఈ రోడ్డుపై వాహనదారులు ప్రయాణాలు చేయలేని విధంగా మారిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లోకి నీరు చేరడంతో మరింత అధ్వానంగా తయారైంది. బురదమయంగా మారిన రోడ్డుపై ప్రయాణాలు సాగించలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంకటగిరి నుంచి గోరంట్ల మీదుగా లద్దగిరికి వెళ్లే రోడ్డును బాగు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్డు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 691 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 691 మంది గైర్హాజరయ్యారు. 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7277 మందికి 6586 మంది హాజరు కాగా 691 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక విద్యార్థి చూచిరాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మహిళలకు సూచనలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

కోడుమూరు రూరల్: మహిళలంతా వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చునని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బంది ప్రజలకందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ వల్ల చాలా మంది మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నా రు. చిన్న వయసులో గర్భం దాల్చటం, ఎక్కువ సార్లు గర్భం దాల్చడం, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం, సురక్షితంకాని లైంగిక పద్ధతుల వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారని, ముందస్తు పరీక్ష లు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ నుంచి బయటపడవచ్చునన్నారు.వైద్యులు అఫాన్ మహ మ్మద్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి



కోడుమూరులో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



గూడూరు సుందరయ్య చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల నాయకులు గపూర్ మియ్యా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గఫార్‌మియ్యా మాట్లాడుతూ.. భూస్వామి కుటుంబంలో పుట్టిన సుందరయ్య పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడటంతో పాటు పేదల కోసం సర్వం త్యాగం చేసిన మహానుభావుడన్నారు. అలాంటి వ్యక్తి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. స్థానిక నాయకులు రాజు, వీరన్న, లక్ష్మన్న, నాగరాజు, గిడ్డయ్య, బుడ్డప్ప తదితరులున్నారు.

గూడూరులో..

గూడూరులో సీపీఎం నాయకులు, కార్యకర్తలు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ.. నీతి నిజాయితీ నిరాడంబరతలో సుందరయ్యకు సాటి ఎవ్వరూ లేరన్నారు. స్థానిక నాయకులు శాంతన్న, సుంకన్న, దానమన్న, హమాలీ కార్మికులు గోపి, మల్లికార్జున, బాలు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబరుడు పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగన్న

ఓర్వకల్లు: పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబరుడని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అన్నారు. సోమవారం బైరాపురం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగన్న మాట్లాడుతూ.. సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ అతి చిన్న వయస్సు నుంచే బడుగు, బలహీన వర్గాలు, వ్యవసాయ కార్మికుల అభ్యున్నతి కోసం పరితపించిన మహనీయుడు సుందరయ్య అని తెలిపారు. తన ఆస్తిని ప్రజా పోరాటానికి, ప్రజలకు ధారాదత్తం చేసిన త్యాగమూర్తి అని కొనియాడారు. నేటి యువత సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో వున్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మహేష్, ఫీల్డు అసిస్టెంట్ ఆదినారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేడుకలకు సంబంధించిన బ్యానర్లను ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓర్వకల్లులోని ఆంజనేయ స్వామి దేవస్థానం, హొళగుందలోని ఆంజనేయ స్వామి దేవస్థానం, గోనెగండ్లలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం, నందికొట్కూరులోని రామాలయం, జూపాడుబంగ్లా మండలం పారుమంచాలలోని ఆంజనేయ స్వామి దేవస్థానాల్లో ఉదయం ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, సింధూరాభిషేకం, ఆకుపూజ, విశేషార్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, సాయంత్రం నాలుగు గంటలకు యవతలో దేశభక్తి భావన కలిగించి, శక్తి ఉపాసకులవుటకు స్థానిక భక్తాదులచే శోభాయాత్రలు, ప్రసాద వియోగం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.